# అడవి

మొగుడున్న రోజుల్లో సుందరమ్మకు సమస్యల్లేవు. జీవితాన్ని గురించీ, తన చుట్టూవున్న ప్రపంచాన్ని గురించీ ఆలోచించాల్సిన అవసరం అంతకన్నా లేదు. మొగుడు కన్నుమూయగనే అన్ని సమస్యలూ తనవే అయ్యాయి.

మొగుడు పోతూ పోతూ - పెళ్ళాం బతికున్నన్ని రోజులూ గడపదాటకుండా కాలుమీద కాలు వేసుకొని తిని బతకడానికి ఆస్తి పాస్తులు మిగిల్చి వుంటే-అది వేరేవిషయం. సుందరమ్మ విషయంలో అలా జరగలేదు. అందుకనే సుందరమ్మ హృదయం పని చెయ్యవలసిన సమయంలో మెదడు పనిచేసింది. పట్టుమని పదేళ్ళన్నా కాపరంచేయందే కన్నుమూసిన మొగుడి శవం మీదపడి "నా దారి యేమిటి దేవుడా?" అని ఏడ్చింది. దారి అంటూ ఒకటి వుంటే ఆమె ఏడుపు మరొకరకంగా వుండేదేమో! "నారుపోసిన దేవుడు నీరు పోయకపోతాడా వూరుకో తల్లీ!" అని వచ్చినవారు ఓదార్చారు. ఆ క్షణం సుందరమ్మకీ అలాగే అనిపించింది. ప్రపంచంలో అందరి ఆడవాళ్ళకీ మొగుళ్ళున్నారా? అందరికీ ఆస్తిపాస్తులున్నాయా? అందరూ యేదోరకంగా బతకటంలేదా? తనుమాత్రం బతకలేకపోతుందా? అనే ధైర్యం కలిగింది. ఆ ధైర్యమే కలక్కపోతే ఆ క్షణాన్నే ఆమె గుండె ఆగిపోయివుండేది?

కష్టసమయాల్లో ఆయినవాళ్ళు దగ్గరుంటే అదోరకం, సుందరమ్మకి ఎవరూలేరు. తల్లిదండ్రులు ఎప్పుడో పోయారు. భర్త చనిపోయాడనితెలిసి అన్న మటుకు వచ్చాడు. వచ్చిన అన్న అందరిలాగే వేదాంతం చెప్పాడు. రెండురోజులుండి మూడోరోజు "వస్తానమ్మా! ఇంటిగ్గర ఎక్కడి పనులక్కడే వున్నాయి" అని ప్రయాణమయ్యాడు.

సుందరమ్మకు కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్లయింది. ఒక రక్తం పంచుక పుట్టినవాళ్ళు, తను కష్టంలో వున్నది - వచ్చినవాడు మంచోచెడో చెప్పి వెళ్తాడను కుంది. అలాటిదేమీ లేకుండానే వెళ్ళడానికి పయనమయ్యాడు. సుందరమ్మ దుఃఖం ఆపుకోలేక బావురుమంది.

"ఊరుకో అమ్మా! ఏడిస్తే పోయినవాళ్ళువస్తారా! ఎలా జర గాల్సివుంటే అలా జరుగుతుంది" అంటూ ఓదార్చాడు.

పోయినవాని కోసం ఏడ్వడంలేదు. ఉన్న ఒక్క అన్నా చచ్చిన వానితో సమానమయ్యాడే అని ఏడుస్తున్నాను అని చెప్పాలనిపించింది. కాని ఏడుపు దిగమింగి 'వెళ్ళిరా' అంది.

పదిరోజులుపట్టు మాసం రోజులు మంచంపట్టి దుఃఖం వెళ్ళ గక్కడం జరుగుబాటు వున్నవాళ్ళకు చెల్లుతుంది. సుందరమ్మ వారం పదిరోజుల్లో మామూలు మనిషి కాకతప్పలేదు. అన్నంముందు కూకున్నప్పుడో రాత్రి పడుకున్నప్పుడో మొగుడు జ్ఞాపకానికి వస్తూనే వున్నాడు. అదో బాధ. అంతకంటే బాధాకరమైంది-ఎలా జీవించడం అన్నది. ఖర్మకొద్దీ తనొక్కతేకాదు, ముగ్గురు పిల్లలున్నారు. ఈ పసిబిడ్డల్ని నెత్తినేసుకొని సంసారం ఎలా యీదడమా అన్నది అనుక్షణం మెదడ్లో తొలుస్తూనేవుంది. ఎంత గింజుకున్నా దానికి సమాధానం రాదు. ఏడుపువస్తుంది. ఏడుస్తూ కూచున్నపుడల్లా ఇరుగమ్మో పొరుగమ్మో వచ్చి "వూరుకో తల్లీ పోయినవాళ్ళతో మనమూ పోతామా? గుండె దిటవుచేసుకోకపోతే లాభంలేదమ్మా" అంటున్నారు.

సుందరమ్మ ఏం చెబుతుంది. తన బాధ ఒకరితో చెప్పుకుంటే తీరేది గనకనా?

సుందరమ్మ ఒకవైపు యిలా కుములుతూనే వుంది. మరొక వైపు బాకీ అసాములు ఇంటిచుట్టూ తిరగడం ప్రారంభించారు. ఎద్దుపుండు కాకికి ముద్దా? వచ్చినవాళ్ళు కాస్తపరామర్శించి బాకీ

విషయం కదుపుతున్నారు. సుందరమ్మకు ఏం చెప్పడానికి నోరు రాదు, మొగానికి చెంగు అడ్డంవేసుకొని వెక్కి వెక్కి యేడ్చేది. ఎంత బాకీ ఆసాములయినా వాళ్ళలోనూ మానవత్వం అంతో యింతో మిగిలే ఉన్నట్లుంది. పోనీ పాపం ఇంకా బాధలో వున్నట్లుంది. ఇంకోనెల ఆగిచూద్దాం అనుకొని వెళ్తున్నారు. వెళ్తూ వెళ్తూ వడ్డీ మొదలూ తమకెంత రావాలో చెప్పిపోతున్నారు. సుందరమ్మ అన్నీ లెక్కవేసుకొంది. దాదాపు పదివేలు. మొగుడు పోతూపోతూ తనకు మిగిలించిందేమిటి? యేడెకరాలమెట్ట, అది అమ్మకానికి పెడితే పదివేలు రావచ్చు. లేదా ధరలు బాగున్నాయి గనుక మరో రెండు, మూడు వేలు ఎక్కువే రావచ్చు. బాకీలు పోను రెండు వేలు, మూడు వేలు మిగిలితే దాంతో జీవితాంతం ఎలా బ్రతకడం?

కష్టం సుఖం ఎరిగిన లౌకికుడు ఒకడు సుందరమ్మకు ఈ విషయంలో ఒక సలహా యిచ్చాడు.

"సుందరమ్మా! ఉన్నదంతా అప్పులవాళ్ళకు వూడ్చి పెడితే నీకు చిప్ప చేతికొస్తుంది. పసిబిడ్డలూ నువ్వూ అలో లక్ష్మణా అని ఆకులు మెయ్యాలి. రెండెకరాలు అమ్మి అప్పులవాళ్ళకి నాలుగణాల వంతో, ఐదణాల వంతో దామాషా యివ్వు. మిగిలిన భూమితో యేదో రకంగా గడుస్తుంది."

సుందరమ్మకిది దివ్యమైన సలహాలాగే కనిపించింది.

"అప్పులవాళ్ళు ఒప్పుకుంటారా?" అంది సంకోచిస్తూ.

"నోరు వాయీ లేని వాళ్ళని చూస్తే భస్తే ఒప్పుకోరు. నువ్వు కొంచెం గట్టిగా నిలబడాలి. ఉన్నదంతా మీ మొఖాన కొడితే నాకు ఆదరువు ఏమిటని మొండికి పడు. ఇది ఊరా? అడివా? నలుగురూ కూడి యేదో ఒకటి చేస్తారు" అన్నాడు ఆ పెద్దమనిషి.

సుందరమ్మ కిదేం నచ్చలేదు. మొగుడున్న రోజుల్లో సుంద రమ్మ పరాయి మగాడితో మాట్లాడి ఎరుగదు. నలుగురు మొగా ళ్ళుంటే వారి ముందు నుంచి నడిచి వెళ్ళాలన్నా సిగ్గు. అలాంటిది

యిప్పుడు నలుగురి ఎదటా నిలబడి.... ఈ ఆలోచనే సుందరమ్మకు నచ్చలేదు.

"ఈ పని నేను చెయ్యలేను" అంది.

"పోనీ పెద్దవాడు మీ బావ వున్నాడు .... ఆయనతో సన్నా మాట్లాడు. ఆయనే యేదో ఒకటి చేస్తాడు" అని ఆ పెద్దమనిషి మరో సలహా యిచ్చాడు.

నిజమే ఊళ్లో బావగారున్నమాట వాస్తవమే. సుందరమ్మ భర్త వున్న రోజుల్లో ఆ అన్నాతమ్ముళ్ళ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. అన్నా తమ్ముళ్ళ మధ్యనే ఆపేక్షలు లేకపోయాక తోటి కోడంౘ్రడకు వుంటాయా? సుందరమ్మకీ తోడుకోడలికి కూడా పడేది కాదు. తమ్ముడు పోతే అన్న అందరిలాగే వచ్చి అందరిలాగే వెళ్ళాడు. అట్లాంటివాళ్ళ దగ్గరికి వెళ్ళి సాయం అర్థించటమంటే సుందరమ్మకు మొదట మనస్కరించలేదు. తర్వాత ఆలోచిస్తే వెళ్ళడమే మంచిదనిపించింది. తను మగదక్షత లేనిది. పంతాలు పట్టింపులు తనకెందుకు? అనుకుంది.

చీకటిపడ్డాక నెత్తిన ముసుగేసుకొని పిల్లల్ని వెంట బెట్టుకొని బావగారింటికి వెళ్ళింది.

వెళ్ళేసరికి బావగారు, తోటికోడలు ఇద్దరూ ఇంట్లోనే వున్నారు.

"ఏమ్మా ఎందుకొచ్చావు?" అన్నాడు సుందరమ్మ బావ.

సుందరమ్మ తనువచ్చిన పనేమిటో విడమర్చి చెప్పింది. "బాకీ అసాములు నాలుగణాల వంతో ఐదణాల వంతో తీసుకుంటే, వాళ్ళ కొంపలు కూలవు - నాకొంప నిలుస్తుంది. నాకు, నాపిల్లలకు యింత నిలవనీడ దొరుకుతుంది. ఈ విషయంలో మీరే ఏదో ఒకటి చెయ్యాలి. మీకన్నా నాకు అయినవాళ్ళు ఎవరున్నారు" అంది దీనంగా.

"రామ! రామ ఇవేంబుద్ధులు సుందరమ్మా? ఫలానా రామకృష్ణ చచ్చిపోగానే, అతని పెళ్ళాం బాకీలు ఎగవేసి ఆస్తి అట్టే పెట్టుకుందంటే ఎంత నామర్దా. లోకులు మొగాన ఉమ్మెయ్యరూ? మీ

బావగారు తలెత్తుకుని తిరగాలా వద్దా?" అంది గుక్క తిప్పకోకుండా తోడికోడలు.

"నీ కెవరో బుద్ధిలేనివాళ్లు యిచ్చారు యీ సలహా. అప్పలు ఎగవేయడం, ఐ. పి. లు పెట్టడం మన యింటా వంటా లేదు. ఏది బడితే అది వేయడమేనా? పరువు, ప్రతిష్ఠా విషయం ఆలోచించనవ సరం లేదా?" అని బావగారు ఛీ కొట్టారు.

సుందరమ్మకి కాళ్ళకింద భూమి తొలుచుకు పోతున్నట్లని పించింది. ఇట్లా జరుగుతుందని వూహించలేదు.

ఆ పెద్దమనిషికి పరువు ప్రతిష్టలు పట్టాయి. తన బ్రతుకు తెరువు విషయం పట్టలేదు. ఉన్న ఆస్తి అప్పలవాళ్ళు రాబందుల్లా తన్నుకుపోయాక, తను కూలో నాలో చేసుకుంటూ బజార్నపడితే ఆయన పరువుప్రతిష్టలు ఇనప్పెట్టెలో వున్నట్టు భద్రంగావుంటాయా?

ఛీ ఛీ ఏం మనుషులు! అనుకుంది సుందరమ్మ. సుందరమ్మ యింటికివచ్చి భోరున యేడ్చింది. బాగా చీకటి పడింది. దీపం కూడా వెలిగించాలనిపించలేదు. అలాగే యేడుస్తూ పడుకుంది. తలుపు దగ్గర యేదో అలికిడి అయినట్లుంటే లేచి దీపం వెలిగించి వాకిట్లోకి వచ్చింది. వాకిట్లో రంగరాజు నిలబడి వున్నాడు.

చిత్రం! సుందరమ్మ ఇన్నాళ్లూ మరో బాకీ ఆసామిని మర్చే పోయింది!

"ఏం రాజూ! నువ్వూ బాకీ అడగటానికే వచ్చావా?" అంది సుందరమ్మ,

రాజు గతుక్కుమన్నాడు. అసలే నోట్లో నాలుకలేని మనిషి. "లేదు చూచి పోదామని వచ్చాను" అన్నాడు నత్తినత్తిగా.

అత్తమీదకోపం దుత్తమీద చూపినట్లు యేదో అలా అంది కాని, రాజు పరామర్శించి పోవడానికే వచ్చాడని సుందరమ్మకి తెలుసు.

"చూసేదేముంది నాయనా! దిక్కులేని దాన్నిగా మిగిలాను" అంది కళ్ళు వత్తుకుంటూ.

సుందరమ్మ కంట తడి చూచి రాజు కంట తడి పెట్టాడు. తన కోసం కంట తడి పెట్టే ప్రాణి ఒకటి వుందని సుందరమ్మకు యిప్పుడే తెలిసింది.

"ఈ పదిహేను రోజుల్నుంచి ఎక్కడ భోంచేస్తున్నావ్?" అంది సుందరమ్మ.

"సర్పంచ్‌గారింట్లో భోంచేస్తున్నా" అన్నాడు రాజు. "పోనీ రేపట్నుంచి యిక్కడికే రారాదూ" అంది సుందరమ్మ.

"నా భోజనానికేంలే యిపుడు" అన్నాడు రాజు. రాజును సుందరమ్మ భోజనానికైతే పిల్చింది కాని - తన పరిస్థితి జ్ఞాపకం వచ్చి మళ్ళీ సంకోచమూ కలిగింది. ఇన్నాళ్ళ పరిస్థితీ వేరు. ఇప్పటి పరిస్థితి వేరు.

సుందరమ్మకు మూడేళ్ళనాటి విషయం జ్ఞాపకానికి వచ్చింది. రాజును సర్పంచ్ వెంటబెట్టుకుని వచ్చాడు. ఆయన సుందరమ్మ భర్త రామకృష్ణను "ఒరే రామకృష్ణా! ఈ అబ్బాయిని మనవూరి హైస్కూలుకు టీచరుగా వేశారు. వెనకా ముందూ ఎవరూ లేరట. తిండి తిప్పల విషయం చూడటానికి మన వూళ్లో హొటళ్ళు లేక పోయే! వీరి మంచిచెడ్డలు మనం చూడకపోతే ఎవరు చూస్తారు? మీ యింట్లో యీ అబ్బాయికి అన్నం యేర్పాటు చూడు. పడుకోటా నికి స్కూలు వుండనే వుంది" అన్నాడు.

"యేమో దాన్నడిగి చెబుతాను" అన్నాడు రామకృష్ణ. "సుంద రమ్మని నువ్వు అడిగేదేమిటి? నేనే అడుగుతాను" అని సుందరమ్మని పిలిచి "నా మొగంచూచి అయినా ఈ అబ్బాయికి వండిపెట్టాలి సుందరమ్మా! తప్పదు" అన్నాడు సర్పంచ్.

పెద్దమనిషి ప్రాథేయపూర్వకంగా అడుగుతూంటే కాదనడానికి సుందరమ్మకు మనసొప్పలేదు. "అలాగే పెదనాన్నా!" అంది.

ఆ రోజునుంచి రాజు తనింట్లోనే భోంచేస్తున్నాడు. తిన్నదానికి ఋణం వుంచుకోకుండా నెలకి అరవై రూపాయ లిస్తున్నాడు. అవసర మొస్తే మూడొందలు అప్పుగాకూడా యిచ్చాడు. ఇన్నాళ్లూ రాజుకు అన్నం పెట్టడంలో లాభనష్టాలను బేరీజువెయ్యలేదు. రాజు యిచ్చే అరవై రూపాయలూ సుందరమ్మకు పెన్నిధిలా కనిపించాయి. రాజు తనింట్లో భోంచేయడంవల్ల అంతోయింతో మిగులుతుంది. తనున్న స్థితిలో అదైనా మేలే సంకోచిస్తే లాభంలేదు. అందుకని సుంద రమ్మ, రాజు లేచివెళ్తుంటే మళ్ళా చెప్పింది. "రేపట్నుంచి భోజనానికి ఇక్కడికే రా రాజూ!" అని. రాజు వస్తానన్నట్టు తల తిప్పాడు.

## 2

బ్రావగారు, తోటికోడలు పెట్టిన చీవాట్లుతిన్నాక అప్పులవాళ్ళతో పేచీపెట్టుకోవడానికి సుందరమ్మకు ధైర్యంచాల్లేదు. ముందు ముందు ఎలా జగగాల్సివుంటే అలా జరుగుతుంది. లోకులతో మాటలుపడటం యెందుకు? అని భూముల్ని అమ్మకానికి పెట్టింది. చిత్రమేమిటంటే-కొంటామని ఒక్కరూ ముందుకురాలేదు. భూమి కొనమని ఒకరిద్దరిని తనే ప్రాధేయపడింది.

"చేలో చేను-మీ బావగారు కొంటా మంటున్నారు. మేం యేం బాగుంటుంది. ఆయనకే యివ్వడం న్యాయం" అన్నారు వాళ్లు. దోపిడీ చేసే వాళ్ళకి కూడా సర్దుబాట్లుంటాయని సుందరమ్మ కేం తెలుసు. బావగారు కొంటారంటే మంచిదే అనుకుంది. వెళ్ళి ఆయన్నే అడిగింది కొనమని.

ఆ మహానుభావుడు కాబట్టీ కాబట్టనట్టు "ఎనిమిది వేలిస్తాను. ఇష్టమైతే అమ్ము. కష్టమైతే మానుకో. బలవంతం లేదమ్మాయ్" అన్నాడు.

పగటిదోపిడీ చెయ్యాలనుకుంటున్న బావగారినిచూస్తే సుంద రమ్మకు మంట పుట్టింది. ఆ ధర కివ్వడానికి యిష్టంలేదు. ఈయ

నేమో పోటీకి మరొకరు రాకుండా కట్టుదిట్టంచేసి, బలవంతం లేదంటున్నాడు. ఈ స్థితిలో తను యేమి చెయ్యగలదు? కంఠదగ్ధంగా శోకంముంచుకొచ్చింది.

“మీయిష్టం. ఎంత న్యాయమని తోస్తే అంతే యివ్వండి” అని తన నిస్సహాయతను వెల్లడి చేసింది.

“న్యాయమైన ధరే చెప్పాను. కావాలంటే నలుగుర్నీ విచారించుకొనే వచ్చి అమ్మ. తొందరేమొచ్చిందమ్మా!” అన్నాడు సౌమ్యంగా.

ఎవరున్నారు తనకు విచారించటానికి? ఆయన అడిగినధరకే ఖాయం చేసింది.

బాకీలకు పోను ఒకటి రెండువేలు మిగులుతాయనుకొంది. అలాంటిది బాకీలకే సరిపోవడంలేదు. బాకీలు నెత్తిమీద పెట్టి పోయిన మొగుడిమీద సుందరమ్మకు కోపం వచ్చింది. ఆ తర్వాత ఆ కోపం బావగారి మీదికి మళ్ళింది. “నీ వారు నాశనంగాను, దిక్కూ మొక్కూలేని ఆడదాన్ని అన్యాంచేసి నువ్వేం బాముకుంటావు!” అని ఒకటికి పదిసార్లు మనసులో తిట్టుకుంది.

ఇలా సుందరమ్మ మనసులో కుళ్ళిచస్తుండగానే మరో సంఘటన జరిగింది. ఒక రోజు రాత్రి రాజు భోజనంచేస్తూ “మీ బావగారు ఇకమీదట నన్ను యిక్కడికి భోజనానికి రావద్దన్నారు” అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

సుందరమ్మ యీమాట విని దిగ్భ్రాంతి చెందింది, “ఎందుకంటా?” అంది కోపంగా. వివరించాల్సిన పనిలేదనుకున్నాడో ఏమో రాజు ఏం మాట్లాడలేదు.

“నేనూ, నా బిడ్డలూ పూట కింత తింటున్నామో లేదోఎవరికీ పట్టదు. నా మానమర్యాదల్ని గురించి మట్టుకు జాగ్రత్తలు తీసుకుంటారు” అని సుందరమ్మ యేడవటానికి మొదలుపెట్టింది.

కథా నిలయం
1416

రాజుకు ఇక భోంచెయ్య బుద్ధిపుట్టలేదు. తింటున్న పళ్లెంలో చెయ్యి కడిగి లేచాడు. ఆమెను ఎలా ఓదార్చాలో బోధపడలేదు. యేడుస్తున్న ఆమెను వదిలి, చెయ్యి తుడుచుకుంటూ వెళ్ళడానికి కాళ్లు రావటంలేదు. అలాగే స్థాణువులా మంచంమీద కూర్చున్నాడు. ఎంతసేపు చూచినా సుందరమ్మ అలాగే యేడుస్తూ కూచుంది. లాభంలేదనుకొని రాజు వెళ్ళడానికి లేచాడు.

"రాజూ!" అంది సుందరమ్మ యేడుపు దిగమింగి. రాజు నిలబడి యేమిటన్నట్లు చూచాడు.

"ఇక్కడే పడుకో" అంది.

రాజు తికమకపడ్డాడు. మనసులో వుండాలనే వుంది. కానీ భయంతో గుండెలు కొట్టుకుంటున్నాయి.

రాజు సందిగ్ధంలో పడ్డాడు.

'ఈ మనిషి తటపటాయింపు చూస్తుంటే వళ్లు మండింది. రాజుకు మొదట్నించి తనమీద మనసన్న విషయం సుందరమ్మకు రూఢిగా తెలుసు. ఈమాత్రం తెలుసుకోడానికి పెద్ద అతీంద్రియ జ్ఞానం అవసరంలేదు. ఏ ఆడదైనా తనపట్ల ఎదుటి మగవాడికి యే భావముందో తేలిగ్గా వూహించగలదు.

"భయమా?" అంది సుందరమ్మ.

"అదికాదు నలుగురికీ తెలిస్తే...." అంటూ నీళ్ళు నమిలాడు.

"తెలియనీ యేం చేస్తారో చూద్దాం" అంది సుందరమ్మ.

రాజు ఇక యేమీ మాట్లాడలేదు.

* * * *

పల్లెల్లో నిప్పులేకుండానే పొగవస్తుంది. నిప్పు వుంటే వేరే చెప్పాలా! వారంరోజులన్నా గడవందే ఊరంతా గుప్పుమంది. నిమ్మకు నీరెత్తినట్లు సుందరమ్మ యేమీ లెక్కచెయ్యలేదు. సుందరమ్మ బావ సుందరమ్మను ఇంటిదగ్గరకు పిలిపించి, నయనా భయానా కూడా మందలించాడు. సుందరమ్మ మొండికెత్తింది.

"నా బతుకు నాది. మీ కెందుకు బాధ" అంది నిర్మోహ మాటంగా.

దాంతో సుందరమ్మ బావగారు ఇటునుంచి లాభం లేదనుకొని అటునుంచి నరుక్కురావడానికి ప్రయత్నించాడు. అంటే రాజును బెదిరించాడు. రాజు సుందరమ్మతో మొరపెట్టుకొన్నాడు.

"నాకేదో భయంగా వుంది. మీ బావగారు నా కాళ్ళూ చేతులు విరిపిస్తానంటున్నాడు. యేం చెయ్యను?" అని. సుందరమ్మకు సహనం చచ్చింది. రాజును చూస్తుంటే జుగుప్స కలుగుతోంది.

"కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదాలనుకున్నాను. నాదే పొరపాటు. వాళ్ళు కాళ్ళూ, చేతులు విరుస్తామంటే నువ్వు మగాడివి కాదూ? ఒంగోలు కోడెలావున్నావు. కోసేస్తే బండెడు కండలున్నాయి. ఆడదానికున్న పౌరుషం లేదేం నీకు?" అంది.

"నేనేమో పరాయి ఊరువాణ్ని, పైగా గవర్నమెంటు ఉద్యోగిని" సమర్థించుకోబోయాడు.

"నోరు మూసుకో! పరాయిఊళ్ళో గవర్నమెంటు ఉద్యోగులు పౌరుషంలేకుండా బతకాలని రాసిపెట్టివుందా?" అని నోటిమీద కొట్టినట్టు మాట్లాడింది సుందరమ్మ.

ఇక నోరెత్తి మాట్లాడడానికి రాజుకు ధైర్యం చాల్లేదు. ఇక రెండు మాటలు గట్టిగా అంటే, కంట తడిపెట్టడానికికూడా సిద్ధంగా వున్నాడు. సుందరమ్మకు జాలికలిగింది. "భయపడకు రాజూ! నేనున్నాను." అని ధైర్యంచెప్పి దగ్గరకు తీసుకుంది.

* *

తన బాధ్యత రాజు మోయవలసింది పోయి తనే రాజు బాధ్యత మోయవలసివస్తుందని సుందరమ్మ వూహించలేదు. తీరా ఇట్లా పరిణమించిన తర్వాత చేతులుముడుచుక కూర్చుంటే లాభం లేదు. ఏదో చెయ్యాలి. సుందరమ్మకు సర్పంచ్ జ్ఞాపకం వచ్చాడు.

ఆయనకు రాజుమీద కూడా అభిమానమే. ఆయనతలచుకుంటే యేమైనా చెయ్యగలడు.

సుందరమ్మ సర్పంచ్ ఇంటికివెళ్ళి తన గోడు వెళ్లబోసుకుంది. "నా బతుకు నేను బతుకుతూవుంటే చూడలేక అంతా కళ్ళల్లోనిప్పులు చల్లుకుంటున్నారు. మీరు ఊరికి పెద్దలు. మీరు కూడా చూస్తూ ఊరుకుంటే, యే నుయ్యో గొయ్యో చూసుకుంటాను" అంది.

ఆయన అంతావిని "నాకు సవాలక్ష పనులు. తలమునకలుగా వున్నాను. తీరిక చేసుకొని నీ విషయం ఆలోచిస్తాను" అన్నారు.

ఒకవైపు కొంపలంటుకున్నాయి. ఈయనకు తీరిక దొరికే దెపుడోనని సుందరమ్మ భయపడింది. సుందరమ్మ వూహ కరెక్టు కాదు. ఆరోజే దీపాలు వెలిగించే సమయానికి సర్పంచ్ సుందరమ్మ ఇంటికి వచ్చాడు. సర్పంచ్ తన విషయం మరచిపోనందుకు సుంద రమ్మకు సంతోషం కలిగింది. మంచం వాల్చి కంబళీ పరచి కూర్చో బెట్టింది.

ముసలాడు మీసాలు సవరించి అసలు విషయం బయట పెట్టాడు. "మీ ఇద్దరికీ యే భయమూ లేదని హామీ యిస్తాను. నన్నూ ఒక కంట చూడాలి" అని.

సుందరమ్మ నిర్ఘాంతపోయింది. ఆయనకు, వయసులో తన కన్నా పెద్దదయిన కూతురు వుంది. ఆయన తన్ను కోరుతున్నాడు. గుండెల్లో మంటలు లేచాయి. స్పృహతప్పి ఎక్కడ పడిపోతానో అనుకుంది. కాని స్పృహ తప్పలేదు.

"యేమంటావ్?" అన్నాడు సర్పంచ్.

యే మంటుంది సుందరమ్మ? తలవాల్చి శ్వాస బిగబట్టి—

"సరే" అంది.

——